

## మోదీపై ఆరేండ్లు నిషేధం విధించాలి

సుప్రీంకోర్టులో పిటిషన్.. తిరస్కరించిన కోర్టు

న్యూఢిల్లీ: ప్రచార సభల్లో విద్వేష ప్రసంగాలు చేసి ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించారని ఆరోపిస్తూ ప్రధాని మోదీని ఎన్నికల నుంచి నిషేధించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను స్వీకరించేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. ప్రజాప్రాతినిధ్య చట్టం ప్రకారం.. మోదీని ఆరేండ్లపాటు ఎన్నికలకు అనర్హులుగా ప్రకటించాలని ఈసీని ఆదేశించాలని కోరుతూ ఫాతిమా అనే మహిళ పిటిషన్ దాఖలు చేశారు. మంగళవారం పిటిషన్‌పై విచారణ జరిపిన ధర్మాసనం.. ఫిర్యాదును పరిష్కరించేందుకు సంబంధిత అధికారులను సంప్రదించాలని పిటిషనర్‌కు సూచించింది. 'మాండమస్ రిట్ కోసం మీరు ముందుగా అధికారులను సంప్రదించాలి' అని ధర్మాసనం పేర్కొన్నది.

# బీజేపీకి మ్యాజిక్ ఫిగర్!

- 7 అంశాలను బట్టి విశ్లేషిస్తున్న రాజకీయ నిపుణులు
- నాలుగు దశల పోలింగ్‌లో భారీగా తగ్గిన ఓటింగ్
- స్టాక్ మార్కెట్లలో కొనసాగుతున్న ప్రకంపనల పర్వం
- దీన్ని ధ్రువపరుస్తూ 22% చేరువకు వీఐఎక్స్ ఇండెక్స్
- ప్రసంగాల్లో ప్రధాని మోదీ అసహనం, విద్వేష వ్యాఖ్యలు
- తాను ఒంటరిని కాదని బల ప్రదర్శన చూపడానికి ఎన్డీయే నాయకులతో కలిసి అట్టహాసంగా ప్రధాని నామినేషన్
- ఎన్నికల వేళ విపక్ష నాయకులను జైళ్లో బంధించి వేధింపులు
- 30 ఏండ్లలో తొలిసారిగా కశ్మీర్‌లో పోటీకి దూరంగా బీజేపీ
- కమలం పార్టీకి 200 సీట్లు కష్టమేనంటున్న సెఫాలజిస్టులు



(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, మే 14 (నమస్తే తెలంగాణ): ప్రస్తుతం జరుగుతున్న లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి మ్యాజిక్ ఫిగర్ దాటే అవకాశం లేదా? సెఫాలజిస్ట్‌లు, ఆర్థిక నిపుణుల నుంచి సామాన్య ప్రజల వరకూ అందరిలోనూ ప్రస్తుతం ఇదే చర్చ నడుస్తున్నది. గడిచిన 25 రోజుల్లో జరిగిన పరిణామాలు, ఏడు ప్రధానాంశాలను లోతుగా విశ్లేషిస్తే, మ్యాజిక్ ఫిగర్‌ను దాటడం బీజేపీకి కష్టమేనని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

**తగ్గుతున్న పోలింగ్ శాతం**

లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా ఇప్పటివరకూ నాలుగు దశల పోలింగ్ ముగిసింది. అయితే, ఈ నాలుగు దశల్లోనూ 2019తో పోలిస్తే, తక్కువ ఓటింగ్ రికార్డవ్వడం అధికార బీజేపీని ఆందోళనకు గురిచేస్తున్నది. ఏప్రిల్ 19న జరిగిన తొలి దఫా పోలింగ్‌లో గతంతో పోలిస్తే 4 శాతం ఓటింగ్ తక్కువగా రికార్డయ్యింది. అదే నెల 26న జరిగిన రెండో దశలోనూ గతంతో పోలిస్తే 3 శాతం ఓటింగ్ తక్కువగా నమోదైంది. దీంతో రెండు దశల పోలింగ్ ముగిసిన తరువాత ఎన్డీయే విజయం అంత కచ్చితం కాకపోవచ్చన్న అంచనాలు పెరుగసాగాయి. దీనికితోడు.. బీజేపీకి కీలకమైన ఉత్తరాది రాష్ట్రాల్లోనూ మోదీ గ్రాఫ్ పడిపోయిందన్న అభిప్రాయాలు బలపడ్డాయి. దీన్ని ధ్రువపరుస్తూ.. మే 7న జరిగిన మూడో దఫాలోనూ గతంతో పోలిస్తే పోలింగ్ రెండు శాతం వరకూ తగ్గింది. మే 13న జరిగిన నాలుగో దశలోనూ గతంతో పోలిస్తే పోలింగ్ 2.3 శాతం వరకూ తగ్గింది.

**మార్కెట్లలో ప్రకంపనలు**

కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే.. ఈ లోక్‌సభ ఎన్నికల్లో హ్యాట్రిక్ విజయం సాధించబోతుందన్న నమ్మకం గతంలో మార్కెట్ వర్గాల్లో ఉండేది. అయితే, ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన తర్వాత ఈ అంచనాలు క్రమంగా తారుమారవ్వడం ప్రారంభించాయి. ముఖ్యంగా నాలుగు దఫాల్లో ఓటింగ్ శాతం గతంతో పోలిస్తే భారీగా తగ్గడంతో ఆ ప్రభావం మొత్తంగా మార్కెట్‌పై పడింది. దీంతో 25 రోజుల వ్యవధిలోనే సెన్సెక్స్ 2,500 పాయింట్ల వరకూ కోల్పోవాల్సి వచ్చింది. రూ. 25 లక్షల కోట్ల మదుపర్ల సంపద ఆవిరైంది.

**వీఐఎక్స్ హెచ్చరికలు**

భారత స్టాక్ మార్కెట్లలో అస్థిరతను సూచించే ఇండియా వొలటాలిటీ ఇండెక్స్ (వీఐఎక్స్) గడిచిన తొమ్మిది సెషన్లలో ఏకంగా 67 శాతం పెరిగి.. 21.88 శాతానికి చేరుకొన్నది. ఇది 52 వారాల గరిష్ఠం. ఒకవిధంగా చెప్పాలంటే.. మార్కెట్లలో అస్థిరత్వం ఉన్నదని వీఐఎక్స్ డేంజర్ బెల్స్‌ను మోగించినట్టు భావించవచ్చు. మొత్తంగా.. బీజేపీకి ఈ ఎన్నికల్లో సీట్లు తగ్గుతాయన్న వార్తలు, ప్రభుత్వం మారే అవకాశమున్నదన్న వాదనలు బలపడటమే మార్కెట్లో ప్రకంపనలకు, వీఐఎక్స్ ఇండెక్స్ పెరుగుదలకు ప్రధాన కారణమని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

**ప్రసంగాల్లో అసహనం, విద్వేషం**

మండిపోతున్న పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరలు, మరోవైపు ఆకాశాన్నంటిన నిత్యావసరాలు, ఇంకోవైపు తారాస్థాయికి చేరిన నిరుద్యోగం.. వెరసి పదేండ్ల బీజేపీ సర్కారు పాలనపై అన్ని వర్గాల్లో తీవ్ర వ్యతిరేకత కనిపిస్తున్నది. దీంతో ఈ ఎన్నికల్లో గెలుపుపై ప్రధాని మోదీకి కూడా అనుమానాలు ప్రారంభమైనట్టు కనిపిస్తున్నది. అందుకే ఎన్నికల ప్రచారంలో భాగంగా గత కొంతకాలంగా ఆయన చేస్తున్న ప్రసంగాల్లో అసహనం, విద్వేషం కనిపిస్తున్నది. 'కాంగ్రెస్ పార్టీ నాయకులు మన తల్లులు, చెల్లెళ్ల మంగళ సూత్రాలను కూడా వదలరు' అని ఒకసారి.. 'దేశ సంపదనంతా చొరబాటుదారులకు, ఎక్కువ మంది పిల్లలు ఉన్నవారికి (ముస్లింలకు) కాంగ్రెస్ పంచిపెడుతుం'దని మరోసారి.. ఇలా మోదీ వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తూ వస్తున్నారు. బీజేపీకి సీట్లు తగ్గుతాయన్న ఆందోళనతోనే మోదీ వ్యాఖ్యల్లో అసహనం, విద్వేషం పాళ్లు పెరుగుతున్నట్టు రాజకీయ నిపుణులు చెబుతున్నారు.

**ఎన్డీయే కూటమి నేతలతో బలప్రదర్శన**

ఏ వేదికపైనైనా, రాజకీయ కార్యక్రమంలోనైనా తాను మాత్రమే హైలైట్ కావాలని ప్రధాని మోదీ కోరుకొంటారు. విజయం సాధిస్తే, తనొక్కడిదే క్రెడిట్‌గా చెప్పుకొంటారు కూడా. ఇది అందరికీ తెలిసిన విషయమే. అయితే, మంగళవారం వారణాసి నుంచి మూడోసారి నామినేషన్ దాఖలు చేసిన ప్రధాని మోదీ.. ఎన్డీయే కూటమి నేతలతో, కేంద్రమంత్రులు, బీజేపీ సీఎంలతో బలప్రదర్శన చేశారు. తనకు సంఘీభావంగా ఎంతమంది వచ్చారో చూడండి అన్నట్టు ఫొటోలకు పోజిచ్చారు. వచ్చే ఎన్నికల్లో ఫలితాలు ఎలా ఉంటాయోనన్న భయంతోనే ప్రధాని ఇలా చేసుండొచ్చని, బీజేపీ ఒంటరి కాదన్న విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడానికే ఆయన ఇలా చేసి ఉండొచ్చని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

**కశ్మీర్‌లో పోటీకి దూరం**

కశ్మీర్ లోక్‌సభ ఎన్నికల బరిలో ఏ ఒక్క బీజేపీ అభ్యర్థి కూడా లేరు. గడిచిన మూడు దశాబ్దాల్లో ఇదే తొలిసారి. కశ్మీర్‌లో మూడు లోక్‌సభ స్థానాలు ఉండగా, ఆ మూడింటిలోనూ బీజేపీ పోటీలో లేదు. కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని రద్దు చేయడాన్ని ఎన్నికల ప్రచారంలో గొప్పగా చెప్పుకొంటున్న ప్రధాని మోదీ నేతృత్వంలోని బీజేపీ అక్కడ పోటీచేయకపోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నది. కశ్మీరీ ప్రజలకు ఇచ్చిన ఉద్యోగ, ఉపాధి, భద్రత హామీలను నెరవేర్చకపోవడం, కశ్మీరీ పండిట్ల హత్యాకాండ వెరసి బీజేపీ గ్రాఫ్ అక్కడ దారుణంగా పడిపోయింది. కశ్మీర్ ఫలితాలు పార్టీకి నష్టం చేకూర్చవచ్చన్న ఉద్దేశంతోనే అక్కడ ఎన్నికల బరి నుంచి బీజేపీ తప్పుకొన్నట్టు నిపుణులు అంచనా వేస్తున్నారు.

**విపక్ష నాయకులపై వేధింపులు**

ఎన్నికలు దగ్గరపడుతున్న కీలక సమయంలో ఆప్ కన్వీనర్ కేజ్రీవాల్, జేఎంఎం నాయకుడు హేమంత్ సోరేన్ వంటి ప్రతిపక్ష పార్టీల నేతలపై కేంద్ర దర్యాప్తు సంస్థలతో మోదీ సర్కారు వేధింపులకు దిగింది. వారిని జైలుకు వెళ్లేలా చేసింది. ఎన్నికల్లో విపక్ష కూటమిని నిర్వీర్యం చేయడానికే అధికార పక్షం ఇలా కక్షపూరితంగా వ్యవహరించిందన్న విమర్శలు ఉన్నాయి.

**బీజేపీ గ్రాఫ్‌పై అంచనాలు**

ఈసారి అధికారాన్ని చేపట్టడానికి అవసరమైన మ్యాజిక్ ఫిగర్ ఎన్డీయేకు రాబోదని, ఆ కూటమికి 268 సీట్లు కూడా దాటబోవని ప్రముఖ సెఫాలజిస్ట్ యోగేంద్ర యాదవ్ పేర్కొన్నారు. మోదీ కరిష్మా, రామమందిర నినాదం ఈ ఎన్నికల్లో పనిచేయబోవని తేల్చిచెప్పారు. ఈ ఎన్నికల్లో బీజేపీకి 200 సీట్లు దాటబోవని సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ అంచనా వేశారు. దేశంలో యాంటీ బీజేపీ సెంటిమెంట్ బలంగా ఉన్నదని, ఆ పార్టీతో ప్రజాస్వామ్యానికి ముప్పు పొంచి ఉందన్న భావన అందరిలోనూ ఉన్నదని వెల్లడించారు. ఇలా ఏడు అంశాలను విశ్లేషించిన అనంతరం.. రానున్న ఎన్నికల్లో బీజేపీ మ్యాజిక్ ఫిగర్‌కు దూరంగానే ఆగిపోతుందని రాజకీయ నిపుణులు అంచనా వేస్తున్నారు.

**లోక్‌సభలో మొత్తం సీట్లు: 543**

ప్రభుత్వ ఏర్పాటుకు కావాల్సిన కనీస మెజారిటీ – 272

ఈ ఎన్నికల్లో బీజేపీకి రాబోయే సీట్లు

- (అంచనా)-200(ప్రశాంత్ భూషణ్),
- 233 (యోగేంద్ర యాదవ్)

### పోలింగ్ సరళి అప్పుడు.. ఇప్పుడు.. ఇలా..

| ఎన్నికల దశ | ఓటింగ్ జరిగిన సీట్లు | 2019లో ఓటింగ్ | 2024లో ఓటింగ్ | తగ్గుదల |
|---|---|---|---|---|
| తొలి | 102 సీట్లు | 70 శాతం | 66.14 శాతం | 3.86 శాతం |
| రెండో | 88 సీట్లు | 69.64 శాతం | 66.71 శాతం | 2.93 శాతం |
| మూడో | 93 సీట్లు | 67.4 శాతం | 65.68 శాతం | 1.72 శాతం |
| నాలుగో | 96 సీట్లు | 69.6 శాతం | 67.3 శాతం | 2.3 శాతం |

నామినేషన్ అనంతరం ఎన్డీయే నేతలతో కలిసి బయటకు వస్తున్న మోదీ

## వారణాసిలో మోదీ నామినేషన్

**హాజరైన కేంద్రమంత్రులు, ఎన్డీయే సీఎంలు**

వారణాసి, మే 14: ఉత్తరప్రదేశ్‌లోని వారణాసి లోక్‌సభ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థిగా ప్రధాని మోదీ మంగళవారం నామినేషన్ వేశారు. ఈ కార్యక్రమానికి పలువురు కేంద్ర మంత్రులు, పలు రాష్ట్రాల సీఎంలతోపాటు ఎన్డీయే కూటమి నేతలు పాల్గొన్నారు. ప్రధాని మోదీ అంతకుముందు పలు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. చారిత్రక వారణాసి ప్రజలకు సేవ చేయడం తనకు గొప్ప అదృష్టంగా భావిస్తున్నానని, ప్రజల ఆశీస్సులతో గత దశాబ్ద కాలంలో ఎన్నో విజయాలు సాధించామని మోదీ ఎక్స్‌లో పేర్కొన్నారు. మోదీ నామినేషన్ ప్రపోజర్లలో ఒక బ్రాహ్మిణ్, ఇద్దరు ఓబీసీ వర్గానికి చెందిన వాళ్లు, ఒక దళిత వ్యక్తి ఉన్నారు.

**సొంత ఇల్లు, కారు లేని ప్రధాని**

తనకు సొంత ఇల్లు, భూమి, వాహనం లేవని ప్రధాని మోదీ ప్రకటించారు. తనకు మొత్తం రూ.3.02 కోట్లు చరాస్థులు ఉన్నట్టు పేర్కొన్నారు. ఎన్నికల నామినేషన్ పత్రాల్లో స్థిరచరాస్థులు, ఆదాయ వివరాల్ని ప్రధాని వెల్లడించారు. వీటి ప్రకారం, ప్రధాని మోదీ మొత్తం స్థిరచరాస్తిలో అత్యధికభాగం రూ.2.89 కోట్లు ఎస్‌బీఐలో ఫిక్స్‌డ్ డిపాజిట్ల రూపంలో ఉంది. నగదు రూ.52,920 ఉందని తెలిపారు. రూ.2,89,45,598 ఫిక్స్‌డ్ డిపాజిట్ల (ఎస్‌బీఐ) రూపంలో ఉంది. అలాగే నాలుగు బంగారు ఉంగరాలున్నాయని, వాటి విలువ రూ.2.67 లక్షలుగా చూపారు. 2018-19 నుంచి 2022-23 మధ్య ప్రధాని మోదీ వార్షిక ఆదాయం రెట్టింపు అయ్యింది. రూ.11 లక్షల నుంచి రూ.23.5లక్షలకు పెరిగింది. అంతేగాక, తనపై ఎలాంటి క్రిమినల్ కేసులూ లేవని, ఢిల్లీ యూనివర్సిటీ నుంచి డిగ్రీ, గుజరాత్ యూనివర్సిటీ నుంచి మాస్టర్ ఆఫ్ ఆర్ట్స్ పొందానని నామినేషన్ పత్రాల్లో పేర్కొన్నారు.

## పోలింగ్‌పై పారదర్శకత పాటించండి

**ఈసీకి పౌరసంఘాల ప్రతినిధుల వినతి**

న్యూఢిల్లీ, మే 14: లోక్‌సభ ఎన్నికలకు సంబంధించిన పోలింగ్ శాతం, ఇతర వివరాల వెల్లడిలో ఎన్నికల సంఘం సంపూర్ణ పారదర్శకత పాటించాలని పౌరసంఘాల ప్రతినిధులు కోరారు. ఈ మేరకు నాలుగు వేల మంది సంతకాలతో కూడిన అర్జీని మంగళవారం ఈసీకి అందజేశారు. మొదటి రెండు విడతల ఎన్నికలకు సంబంధించిన గణాంకాల వెల్లడిలో చోటుచేసుకున్న హెచ్చుతగ్గులను వారు ప్రధానంగా ప్రస్తావిస్తూ ఈ చర్య కారణంగా ఎన్నికల సంఘం పనితీరు, పారదర్శకత పట్ల ప్రజల్లో పలు అనుమానాలు వస్తున్నాయని పేర్కొన్నారు. మొదటి రెండు విడతల్లో ఎన్నికలైనప్పుడు ప్రకటించిన శాతానికి, తర్వాత చాలా రోజులకు ప్రకటించిన తుది పోలింగ్ శాతానికి 6 శాతానికి పైగా తేడా ఉందని, ఈ తుది వివరాలపై ఈసీ ఎలాంటి సంతృప్తికరమైన వివరణ ఇవ్వకుండానే విడుదల చేసిందన్నారు. ఈ అర్జీపై సంతకం చేసిన వారిలో న్యాయవాదులు, సామాజిక కార్యకర్తలు, సివిల్ సర్వీస్ మాజీ అధికారులు ఉన్నారు.

## బహిరంగ క్షమాపణ చెప్పండి

**సుప్రీంకోర్టుకు వ్యతిరేకంగా వ్యాఖ్యలు సరికాదు**

ఐఎంఏ చీఫ్ అశోకన్‌పై న్యాయస్థానం ఆగ్రహం

న్యూఢిల్లీ, మే 14: ఓ ఇంటర్వ్యూలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్‌వీ అశోకన్ చేసిన వ్యాఖ్యలపై సుప్రీంకోర్టు మంగళవారం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. కోర్టుకు వ్యతిరేకంగా ఆయన చేసిన వ్యాఖ్యలను తప్పుబట్టింది. బేషరతు క్షమాపణలు చెబుతూ అశోకన్ దాఖలు చేసిన అఫిడవిట్‌ను తిరస్కరించిన జస్టిస్ హిమాకోహ్లీ, ఏ అమనుల్లా ధర్మాసనం.. బహిరంగ క్షమాపణలు చెప్పాల్సిందేనని స్పష్టం చేసింది. 'సోఫాలో కూర్చొని కోర్టును బహిరంగంగా విమర్శిస్తూ ఇంటర్వ్యూలు ఇవ్వలేరు' అని పేర్కొన్నది. 'మీ నుంచి మేం బాధ్యతాయుతమైన ప్రవర్తనను ఆశించాం. అలాంటి వ్యాఖ్యలు చేయడానికి కారణం ఏంటి? అవతలి వాళ్లను కోర్టుకు లాగిన మీరు.. కోర్టు ఆర్డర్ తర్వాత మీరు కూడా అదేవిధంగా మీడియా ముందు స్టేట్‌మెంట్లు ఇచ్చారు?' అని న్యాయస్థానం అసంతృప్తి వ్యక్తం చేసింది. సుప్రీంకోర్టు గౌరవాన్ని తగ్గించే ఉద్దేశం తనకు లేదని, తన తప్పు తెలుసుకొన్నానని, తన వ్యాఖ్యలకు చింతిస్తూ క్షమాపణలు చెబుతున్నానని అశోకన్ అఫిడవిట్‌లో పేర్కొన్నారు.

## నాకు నితీశ్ సంపూర్ణ మద్దతు!

**ఆర్జేడీ నేత తేజస్వీ వ్యాఖ్యలు**

పాట్నా: ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. బీజేపీపై తాను చేస్తున్న పోరాటంలో తన అంకుల్ జేడీయూ నేత, బీహార్ సీఎం నితీశ్ కుమార్ నుంచి 'పూర్తి మద్దతు' ఉన్నదని పేర్కొన్నారు. రాష్ట్రంలోని మధుబని జిల్లాలో మంగళవారం జరిగిన ఎన్నికల ర్యాలీలో తేజస్వీ యాదవ్ మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. 'నితీశ్ చాచా ఆశీస్సులు నాపై మెండుగా ఉన్నాయి. ప్రధాని మోదీ నామినేషన్ దాఖలు చేస్తున్న రోజునే ఆయన అనారోగ్యానికి గురికావడాన్ని గమనించాలి. దీన్ని బట్టి ఆయన మద్దతు నాకు స్పష్టంగా ఉన్నది' అని అన్నారు.

## నిందితుల జాబితాలో ఆప్!

- మద్యం పాలసీ కేసులో చేరుస్తామని ఢిల్లీ హైకోర్టుకు తెలిపిన ఈడీ
- ఓ జాతీయ పార్టీని నిందితుల జాబితాలో చేర్చడం ఇదే తొలిసారి!

న్యూఢిల్లీ, మే 14: ఢిల్లీ మద్యం పాలసీకి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో ఆమ్‌ఆద్మీ పార్టీ(ఆప్)ని నిందితుల జాబితాలో చేరుస్తామని ఈడీ మంగళవారం ఢిల్లీ హైకోర్టుకు తెలిపింది. ఆప్ నేత మనీశ్ సిసోడియా బెయిల్ పిటిషన్‌పై విచారణ సందర్భంగా ఈడీ ఈ మేరకు న్యాయస్థానానికి వెల్లడించింది. ఈ కేసులో అనుబంధ చార్జిషీట్ దాఖలు చేస్తామని, అందులో ఆప్‌ను నిందితుల జాబితాలో చేరుస్తామని తెలిపింది. ఇదే గనుక జరిగితే, ఈడీ చరిత్రలో తొలిసారిగా ఓ జాతీయ పార్టీ పేరును నిందితుల జాబితాలో ప్రస్తావించినట్టు అవుతుందని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ఈడీ, సీబీఐ కేసుల్లో సిసోడియా పెట్టుకొన్న బెయిల్ దరఖాస్తులపై వాదనలు విన్న జస్టిస్ స్వరణ కాంత శర్మ నేతృత్వంలోని ధర్మాసనం.. తీర్పును రిజర్వ్ చేసింది.

**ఏం జరుగుతుంది?**

ఆప్‌ను నిందితుల జాబితాలో చేరిస్తే ఆ పార్టీ పలు ప్రతికూల పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా ఆప్‌నకు చెందిన ఆస్తులు, బ్యాంకు ఖాతాలను ఈడీ అటాచ్ చేయవచ్చు. పార్టీ ఆఫీస్ బేరర్లు బాధ్యులుగా మారొచ్చు. ప్రజాప్రాతినిధ్య చట్టం ప్రకారం పార్టీ గుర్తింపు రద్దు చేయాలని కోరేందుకు దీన్ని ప్రత్యర్థి పార్టీలు ఒక రాజకీయ ఆయుధంగా ఉపయోగించుకొనేందుకు అవకాశం ఉంటుంది.

**బీజేపీ పొలిటికల్ వింగ్‌లా ఈడీ**

ఆప్ నిందితుల జాబితాలో చేరుస్తామన్న ఈడీ ప్రకటనపై ఆ పార్టీ స్పందించింది. బీజేపీకి ఈడీ పొలిటికల్ వింగ్‌లా మారిందని విమర్శించింది. ఆప్‌ను అణచివేసే ఉద్దేశంతోనే ఈ కేసును అక్రమంగా బనాయించారని ఆరోపించింది. కేసులో అప్రూవర్లుగా మారిన నిందితులతో బీజేపీకి లింకులున్నాయని పేర్కొన్నది.

## మలివాల్‌పై దాడి నిజమే

- నిందితుడిపై కఠిన చర్యలు
- ఆప్ నేత సంజయ్ సింగ్

స్వాతి మలివాల్

న్యూఢిల్లీ, మే 14: ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ అధికారిక నివాసంలో ఆప్ రాజ్యసభ ఎంపీ స్వాతి మలివాల్‌కు ఎదురైన చేదు అనుభవం ఆ పార్టీని తీవ్రంగా కుదిపేసింది. స్వాతి మలివాల్ పట్ల అనుచితంగా ప్రవర్తించి, దాడికి పాల్పడ్డ కేజ్రీవాల్ పీఎస్ బిభవ్‌కుమార్‌పై కఠిన చర్య తీసుకుంటామని ఆప్ నేత సంజయ్ సింగ్ తాజాగా ప్రకటించారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ఈ దుశ్చర్యను పార్టీ తీవ్రంగా ఖండిస్తున్నదని తెలిపారు. 'స్వాతి మలివాల్ సోమవారం సీఎం కేజ్రీవాల్‌ను కలుసుకునేందుకు ఆయన అధికారిక నివాసానికి వెళ్లారు. డ్రాయింగ్ గదిలో సీఎం కోసం ఎదురుచూస్తుండగా, ఆమెతో పీఎస్ బిభవ్‌కుమార్ అనుచితంగా ప్రవర్తించాడు. ఈ విషయం కేజ్రీవాల్‌కు తెలిసింది. నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోనున్నారు' అని చెప్పారు. ఘటనకు సంబంధించి స్వాతి మలివాల్ సివిల్ లైన్స్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అయితే రాతపూర్వక ఫిర్యాదు ఆమె నుంచి అందలేదని ఢిల్లీ పోలీసులు తెలిపారు.

బుల్లెట్ రైల్ ప్రాజెక్ట్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న దహను గ్రామ మహిళలు

## ఆ రైల్లో పేదోడు ఎక్కుతాడా?

- బుల్లెట్ రైలుతో మాలాంటోళ్లకు ఉపయోగమేంటి?
- భూములు తీస్కున్నరు.. మా పిల్లలకు జాబ్స్ ఇవ్వలే
- బీజేపీ సర్కారుపై మహారాష్ట్ర పాలఘర్ గ్రామస్థుల ఆగ్రహం

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, మే 14 (నమస్తే తెలంగాణ): బుల్లెట్ ట్రైన్ పేరుచెప్పి ప్రధాని మోదీ సహా బీజేపీ నేతలు ఎన్నికల ప్రచారం చేసుకొంటున్నారని, అలాంటి ఖరీదైన రైలులో ఏ పేదోడైనా ఎక్కుతాడా? అని మహారాష్ట్రలో పాలఘర్ జిల్లాలోని దహను అంబేసరి, జంషేట్ తదితర గ్రామాల ప్రజలు ప్రశ్నిస్తున్నారు. బుల్లెట్ రైలు కోసం తమ పొలాలను తీసుకొన్న బీజేపీ సర్కారు తగిన పరిహారం కూడా ఇవ్వలేదని వాపోయారు. భూములిచ్చిన రైతుల పిల్లల్లో అర్హులైన వారికి తగిన ఉద్యోగం ఇస్తామన్న సర్కారు అది కూడా చేయలేదని ధ్వజమెత్తారు. బుల్లెట్ రైలుతో పేదలైన రైతులకు ఏం ఉపయోగమని నిలదీశారు. మోదీ ఫొటోతో 'ఫ్రీ రేషన్' అని ముద్రించిన సంచీలను పంచారని, రేషన్ సరుకులు రాక ఏడాది దాటిపోయిందని వాపోయారు. బీజేపీ హయాంలో అభివృద్ధి అంటే ధనికులకు సంబంధించినదేనని, తమలాంటి పేదవాళ్లకు ఒరిగిందేమీ లేదని మండిపడ్డారు.

**బుల్లెట్ రైలు మేం ఎక్కుతామా?**

బుల్లెట్ రైలుతో మాకు ప్రయోజనమేంటి? దాంట్లో మేమేమైనా ఎక్కి ప్రయాణించగలమా? ఆ తాహతు మాకు ఉందా?

–చందుబీమా, గిరిజన రైతు, దహను గ్రామం

**ఉద్యోగాలు ఇవ్వలే**

బుల్లెట్ రైలు కోసమని మా భూములను బలవంతంగా లాక్కొన్నారు. తగిన అర్హతలు ఉన్నప్పటికీ మా పిల్లలకు ఉద్యోగాలు ఇవ్వలే.

– లడ్‌కూబాయ్ కోంబ్, గృహిణి, జంషేట్ గ్రామం

## వీలైతే బైడెన్‌ను చంపాలనుకున్నా

**వైట్‌హౌస్‌పై దాడి కేసులో నేరాన్ని ఒప్పుకున్న సాయి వర్షిత్**

వాషింగ్టన్, మే 14: వైట్‌హౌస్ పరిసరాల్లోకి ట్రక్కుతో దూసుకొచ్చి దాడి చేసిన కేసులో తెలుగు కుర్రాడు సాయివర్షిత్ కందుల (20) నేరాన్ని అంగీకరించాడు. తన లక్ష్యం కోసం వీలైతే అధ్యక్షుడు బైడెన్‌ను చంపాలనుకున్నానని కోర్టు విచారణలో తెలిపాడు. గత ఏడాది మే 22న సాయి వర్షిత్ అద్దె ట్రక్కుతో వైట్‌హౌస్ వద్ద బీభత్సం సృష్టించాడు. వైట్‌హౌస్ భవనంలోకి వెళ్లి అధికారాన్ని కైవసం చేసుకోవడమే లక్ష్యంగా ఈ దాడి చేశానని నిందితుడు విచారణలో తెలిపాడు. తన లక్ష్యాన్ని చేరుకునే క్రమంలో వీలైతే అధ్యక్షుడు బైడెన్ సహా ఇతరులను కూడా చంపాలని ముందుగానే ప్లాన్ చేసుకున్నట్టు చెప్పాడు. ఈ కేసులో నిందితుడు ఉద్దేశపూర్వకంగా ప్రజా ప్రభుత్వానికి హాని చేసేందుకు ఈ ఘటనకు పాల్పడినట్టు విచారణలో రుజువైందని యుఎస్ అటార్నీ తెలిపింది.

# మోదీ సీట్లో ఎవరు?

మొదటిపేజీ తరువాయి...

వారసుడిగా ఎవరు అర్హులో కూడా చర్చించింది. మ్యాగజీన్ కథనంలో పేర్కొన్న ప్రధానాంశాలు సమగ్రంగా..

**కేజ్రీవాల్ ప్రశ్నతో చర్చ మొదలు..**

'మోదీ తర్వాత ఆయన వారసుడిగా ఎవరు ఉంటారు? ప్రధానిగా ఎవరు బాధ్యతలు చేపడుతారు?' అని గతవారం కేజ్రీవాల్ ప్రశ్నించారు. 75 సంవత్సరాలు నిండిన నేతలకు రిటైర్మెంట్ ప్రకటించి పంపించే సంప్రదాయం బీజేపీలో ఉన్నదని గుర్తుచేసిన కేజ్రీవాల్.. మరికొన్నాళ్లలో 75 ఏండ్లు పూర్తిచేసుకోబోతున్న ప్రధాని మోదీ ఆ సంప్రదాయాన్ని కూడా పాటిస్తారా? అని ప్రశ్నించారు. బీజేపీ సీనియర్లు ఎల్‌కే అద్వానీ, మురళీ మనోహర్ జోషి, సుమిత్రా మహాజన్‌ను వయసు ప్రాతిపదికన బలవంతంగా పక్కనపెట్టిన విధానాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. మోదీ తర్వాత ఆయన వారసుడిగా కేంద్ర హోంమంత్రి అమిత్ షా పగ్గాలు చేపడుతారని, షాను ప్రధానిని చేయడానికే మోదీ ఓట్లు అడుగుతున్నట్టు చెప్పారు. దీనిపై షా కూడా వెంటనే స్పందించారు. 75 ఏళ్లు నిండిన తరవాత నరేంద్ర మోదీ ప్రధానిగా కొనసాగకూడదని బీజేపీ రాజ్యాంగంలో ఎక్కడా రాయలేదన్నారు. తదుపరి ఐదేండ్లు కూడా ప్రధానిగా నరేంద్ర మోదీనే కొనసాగుతారని చెప్పుకొచ్చారు. అయితే, గడిచిన నాలుగు దశల ఎన్నికల్లో ఓటింగ్ శాతం క్రమంగా తగ్గుతుండటం, ప్రచారంలో ముస్లింలను బద్నాం చేస్తూ హిందూత్వను ముందరేసుకోవడానికే మోదీ మొగ్గు చూపడం.. వెరసి మోదీ పట్ల ప్రజల్లోనూ అంతకంతకూ అసంతృప్తి, విసుగు పెరుగుతున్నది. ఈ క్రమంలో కేజ్రీవాల్ లేవనెత్తిన 'మోదీ తర్వాత..' ప్రశ్న ప్రాధాన్యతను సంతరించుకొన్నది. బీజేపీలోనూ ఈ చర్చ క్రమంగా పెరుగుతున్నట్టు ఆ పార్టీ వర్గాల ద్వారా తెలిసింది.

**భవిష్యత్తులో బీజేపీకి నష్టమే!**

2019 ఎన్నికల్లో బీజేపీ భారీ మెజారిటీతో గెలిచింది. మోదీని చూసే బీజేపీకి చాలామంది ఓట్లేశారు. అయితే, ఈ విషయమే భవిష్యత్తులో బీజేపీకి నష్టదాయకంగానూ మారొచ్చు. ఒకవేళ ప్రధాని మోదీ రిటైర్మెంట్ (వయసు రీత్యా లేదా ఆరోగ్య కారణాల వల్ల కూడా) తీసుకొని ఇప్పటికిప్పుడు రాజకీయాలకు దూరంగా ఉంటే, మిత్రపక్షాలు బీజేపీతో ఇప్పుడు ఉన్నంత సఖ్యతగా ఉంటాయా? అనేది సందేహమే. ఓటర్ల మద్దతు బీజేపీకి ఎలా ఉంటుందన్నది కూడా ప్రశ్నే. అందుకే, మోదీ వారసుడిని నిర్ణయించడం ఆ పార్టీ అధిష్ఠానానికి ఇప్పుడు సవాలుగా మారింది. ఒకవేళ, తదుపరి ప్